# 17908 వద్ద నిరోధం!




**సమీక్ష:** గత వారమూ బుల్ హవా నడిచింది. ఎఫ్ఐఐల కొనుగోళ్ల మద్దతు, రూపాయి మారకం విలువ పుంజుకోవడం, ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు మార్కెట్లలో లాభాలకు కారకాలు అయ్యాయి. వారారంభంలో మార్కెట్లు ప్రతికూలంగా మొదలయ్యాయి. కార్పొరేట్ ఫలితాలు కొంత నిరుత్సాహపరచడంతో సూచీలు దిగువకు చేరాయి. అయితే గ్రీస్‌లో సానుకూల పరిణామాలకు తోడు దేశీయంగా ఎస్‌బీఐకి ప్రభుత్వం మూలధనాన్ని ఇస్తోందన్న వార్తల నేపథ్యంలో రికవరీ జరిగింది. భారత్ సహా చైనా, అమెరికా, ఐరోపాలలో తయారీ గణాంకాలు రాణించడంతో పాటు వాహన కంపెనీలు ప్రకటించిన విక్రయ గణాంకాలు అంచనాలను మించడం ర్యాలీ కొనసాగడానికి తోడ్పడ్డాయి. అయితే 122 2-జి స్పెక్ట్రమ్ లైసెన్సులను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేయడం మార్కెట్లో విక్రయాల ఒత్తిడిని సృష్టించింది. కానీ అంతర్జాతీయ మార్కెట్లు రాణించడంతో ఆ ప్రభావం మన మార్కెట్లపైనా ప్రసరించింది. ఫలితంగా సెన్సెక్స్ వారం మొత్తంమీద 371 పాయింట్లు లాభపడి, ఆఖరులో 17605 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల తీరు:** డాలరుతో పోలిస్తే రూపాయి మారక విలువ పటిష్టపడంతో ఎఫ్ఐఐలు పెట్టుబడులు కొనసాగించారు. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో వారు రూ.6157.30 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. మ్యూచువల్ ఫండ్లు రూ.451.80 కోట్ల మేర లాభాల స్వీకరణకు దిగాయి.

**రంగాల వారీగా:** దేశీయంగా మార్కెట్ పరిస్థితులు మెరుగ్గా కనిపిస్తుండడంతో స్థిరాస్తి వంటి రంగాలు రాణించాయి. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండడంతో పాటు నెలవారీ గణాంకాలు బాగుండడం వాహన షేర్లు రాణించడానికి దోహదం చేసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు ఐటీ కౌంటర్లో కొనుగోళ్లకు పురికొల్పాయి. ఎస్‌బీఐకి నిధుల రాక, కొన్ని బ్యాంకుల ఆర్థిక ఫలితాలు ఆకట్టుకోవడంతో బ్యాంకింగ్ సూచీ లాభాల బాటలో సాగింది. మన్నికైన వినిమయ వస్తువుల రంగం, యంత్ర పరికరాల షేర్లు డీలా పడ్డాయి.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం స్థానిక మార్కెట్లలో అనుకూల కదలికలను సూచిస్తోంది.**

**ఈ వారంపై అంచనా:** 200 రోజుల చలన సగటును మార్కెట్ అధిగమించడం మార్కెట్లో రికవరీ కొనసాగుతుందనడాన్ని తెలియజేస్తోంది. 17908 స్థాయికి ఎగువన మార్కెట్ ముగిసినట్లయితే దీర్ఘకాల ఊర్ధ్వముఖ ధోరణిలోకి మార్కెట్ తిరిగి అడుగు పెట్టినట్లు అవుతుంది. (మార్కెట్ 21109 గరిష్ఠ స్థాయి నుంచి దిద్దుబాటుకు లోనై డిసెంబరు 2011లో 15136కు చేరింది. ఈ దిద్దుబాటు పూర్తవుతుందన్నమాట.) అయితే మార్కెట్ 21,109 స్థాయిని తిరిగి పరీక్షించడానికి సమయం పట్టొచ్చు. మధ్యకాలానికి మార్కెట్ లాభాల్లోనే కొనసాగొచ్చు. అయితే అధిక స్థాయిల వద్ద స్వల్పకాలంలో లాభాల స్వీకరణ జరగొచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** అంతర్జాతీయంగా అమెరికా ఐరోపా పరిణాలను మార్కెట్ సునిశితంగా గమనించొచ్చు. భారత పారిశ్రామికోత్పత్తి గణాంకాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలను అంచనా వేయొచ్చు. త్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయనున్నాయి. రూపాయి మరింత బలపడితే మార్కెట్‌కు దన్ను దొరకవచ్చు. ఇక ఎఫ్ఐఐల కొనుగోళ్లు, ముడి చమురు ధరలు యథావిధిగా ప్రభావం చూపవచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు: 17908, 18269, 18440;**

**తక్షణ మద్దతు స్థాయిలు: 17433, 17112, 16828.**

**17908 వద్ద నిరోధం ఎదుర్కోవడానికి ముందు మార్కెట్ స్వల్పకాలంలో మరింత పెరిగే అవకాశం ఉంది.**

– సతీశ్ కంతేటి, జెన్ మనీ